‘స్వస్త్ నారీ.. సశక్తి పరివార్’

నల్లకుంట: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని బుధవారం నల్లకుంటలో ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రధాని మోదీ పిలుపు మేరకు ‘స్వస్త్ నారీ.. సశక్తి పరివార్’ అభియాన్‌లో భాగంగా తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ డా. దీప్తి పటేల్, గైనకాలజిస్టు డా. శమంత, పిల్లల వైద్య నిపుణుడు డా. వినయ్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డా. జయసంహిత, బీజేపీ నాయకులు ఎం. మధుయాదవ్, ఎం. మురళీయాదవ్, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సర్వజన్ వికాస్ మంచ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలో ప్రముఖ సామాజికవేత్త పెరియార్ రామస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ... రామస్వామి చేసిన పోరాటం వల్ల అణగారిన కులాల వారికి దేవాలయాల ప్రవేశం, పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన అవకాశాలు లభించాయని అన్నారు. ఆయన చేసిన పోరాటం వల్ల అణగారిన ప్రజలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొల్ల జనార్దన్, రామచంద్ర, నాగభూషణం, భరత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

‘సాయుధ పోరాటానికి గొప్ప చరిత్ర ఉంది’

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచంలో గొప్ప చరిత్ర ఉందని ప్రొఫెసర్ తిరుమలి అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ విలీన దినం పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలి మాట్లాడుతూ... నిజాంపాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు చిత్రహింసలకు గురయ్యారని అన్నారు. రజకారుల ఆగడాలను భరించలేని ప్రజలు సాయుధ పోరాటాన్ని చేశారన్నారు. చివరికి సెప్టెంబర్ 17న నిజాం హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేశారని తెలిపారు. ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి నందిని సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రముఖ కవి డాక్టర్ నందిని సిద్దారెడ్డి రచించిన నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే నాటకాన్ని త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు.

ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటించాలి

చిక్కడపల్లి: ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌సార్ ఎల్‌బీనగర్‌లో నిర్వహిస్తున్న అమరణ దీక్షకు మద్దతుగా బుధవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం నిరుద్యోగులు అశోక్‌నగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. నిరుద్యోగ జేఏసీ నాయకులు కయ్యు వెంకటేష్, మాట్లాడుతూ.. వెంటనే 2లక్షల ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అశోక్‌సార్‌ను పరామర్శించేందుకు వెళ్లేందుకు నిరుద్యోగులు సమాయత్తం కాగా పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు. అశోక్‌సార్‌కు ఏమైనా అయితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాచిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా పరివార్ హోటల్ వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి (30) ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. దీంతో అతడిని ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మకుంట రెడీ.!

అందరి అంచనాలకు మించి కుంట అభివృద్ధి

- అంబర్‌పేటకు మణిహారంగా మారిన బతుకమ్మకుంట
- పనుల జాప్యంతో ఈనెల 21న ప్రారంభోత్సవం వాయిదా
- ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు



బతుకమ్మకుంట పునరుద్ధరణతో రూపుదిద్దుకుంటున్న కుంట ప్రధాన ద్వారం



బతుకమ్మకుంటలో అభివృద్ధి పనులు

అంబర్‌పేట: అంబర్‌పేట నడిబొడ్డులో ఒక సుందరమైన చెరువు రూపుదిద్దుకుంటుందని ఎవరూ ఊహించి ఉండరు. అందరి అంచనాలకు మించి బతుకమ్మకుంట పునరుద్ధరణ పూర్తి కావడంతో ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. గతేడాది హైడ్రా బతుకమ్మకుంట పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించి యుద్ధ ప్రతిపాదికన పనులు ప్రారంభించింది. అప్పటికప్పుడు కుంట తవ్వకాలను చేపట్టడంతో అనూహ్యంగా నీరు ఉబికి వచ్చి సహజసిద్ధంగా ఇక్కడ కుంట ఉండడానికి నిదర్శనంగా నిలిచింది. అప్పటి నుంచి వివాదాలు ముగిసినా కుంట పనులు వేగంగా నిర్వహించి తవ్వకాలు చేపట్టారు. దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్, నలుమూలల కూర్చోవడానికి అనువుగా తీర్చిదిద్దారు. ఇందులోకి నీరు వచ్చే మార్గం, వెళ్లే మార్గాలను ఇంజినీర్లు ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేశారు. మొత్తానికి అంబర్‌పేటలో ఓ మినీ ట్యాంక్‌బండ్‌ను ఆవిష్కృతం చేశారు.

బతుకమ్మ కోసం ప్రత్యేకం..

బతుకమ్మకుంట బతుకమ్మలు వేయడానికి గతంలో ఉండేదని, అది మాయం అయ్యిందని దానిని పునరుద్ధరించాలంటూ అనేక డిమాండ్లు వచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వీ.హనుమంతారావు రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తూ వస్తున్నారు. ‘తన జీవిత కల’అంటూ పలు వేదికలపై బతుకమ్మకుంటను పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రాగానే ఆయన నేరుగా సీఎం కలిసి బతుకమ్మకుంట పునరుద్ధరించాలని కోరారు. వెంటనే సీఎం హైడ్రాను ఆదేశించడం చకచక జరిగిపోయాయి. రంగంలోకి దిగినా హైడ్రా పూర్వపరాలు పరిశీలించి పనులు ప్రారంభించింది. న్యాయస్థానంలో ఉన్న అంశాలపై స్పష్టత తీసుకుని పనులు ప్రారంభించింది. బతుకమ్మ నాటికి బతుకమ్మకుంట పునరుద్ధణ పూర్తి చేస్తామని లక్ష్యాన్ని పెట్టుకుని దాదాపు పూర్తి చేసింది.

ఈనెల 25 సీఎం చేతుల మీదుగా..

పునరుద్ధరించిన బతుకమ్మకుంటను ఈనెల 25న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆడపడుచుల బతుకమ్మ ఆటల కోలాహలం మధ్యన సీఎం బతుకమ్మకుంటను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు బతుకమ్మకుంటలో వైభంగా బతుకమ్మ ఆడుకోవడానికి అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారు.

ప్రారంభోత్సవానికి కొంత ఆలస్యం..

అభివృద్ధి చేసిన బతుకమ్మకుంటను తొలుత ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా ఈ నెల 16న (మంగళవారం) ముందుస్తు ఏర్పాట్లు పరిశీలన కోసం పలువురు బతుకమ్మకుంటను సందర్శించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు పలువురు పనులను పరిశీలించారు. ఈనెల 21 ప్రారంభం సాధ్యం కాదని తేల్చారు. ఇక్కడి పనులు కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కొన్ని హడావుడి పనులతో అపహాస్యపాలవుతామని వారు తెలిపారు. పనుల్లో అలసత్వం వద్దని కాంట్రాక్టర్‌కు సూచించి సీఎం కార్యక్రమన్ని మరో 4 రోజులు వాయిదా వేశారు.

మహిళా చైతన్యంతోనే సామాజిక చైతన్యం



సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: మహిళా చైతన్యంతోనే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఛే-నంబరు చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మహిళా చైతన్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళ సాధికారిత కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని ఆయన వివరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న మహిళా పొదుపు సంఘాల అభ్యున్నతికి తన వంతు చేయూతను ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 29న సోమవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు చేసుకోవాలని ఆయన కోరారు. బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర మహిళలకు పిలుపునిచ్చారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైదులు, సిబ్బందికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12 రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈనెల 28 వరకు ప్రతి నిత్యం స్పెషలిస్టు వైద్యులు హాజరై వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులను ఆరికట్టడానికి కట్టుదిట్టమైన వైద్యసేవలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ హర్షశ్రీ, డాక్టర్ స్వేచ్ఛ, వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, చందు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బదిలీ

కవాడిగూడ: దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బదిలీ అయ్యారు. 2023లో దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగారు. సాధారణ బదిలీలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ 50 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. శ్రీనివాస్ రెడ్డిని స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఎస్‌బీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మహ్మద్ అంజద్‌అలీని దోమలగూడ ఇన్‌స్పెక్టర్‌గాగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా దోమలగూడ డీఐగా విధులు నిర్వహిస్తున్న మల్లేశంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రధాని మోదీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మోదీ సర్కార్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో మోదీ జన్మది నాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీని స్ఫూర్తిగా తీసుకొని దేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. పేదరిక నిర్మూలన కోసం ఆయన ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వికసిత్ భారత్‌ను జయప్రదం చేయాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉన్న వారే రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్, కార్పొరేటర్ కె.రవిచారి, కె.పార్థసారథి, జయపాల్‌రెడ్డి, పూస రాజు, నవీన్ ముదిరాజ్, జి.కిరణ్, రమేష్ రాం, కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై 30 శాతం రిబేట్

చిక్కడపల్లి: తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోఆప్టెక్స్ వస్త్ర షోరూమ్‌లో దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని చేనేత వస్త్రాలపై 30శాతం రిబేట్‌పై అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు షోరూమ్ ఇన్‌చార్జ్ ఎ.వీరయ్య తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఆధునీకరించి తమిళనాడు చేనేతశాఖ మంత్రి ప్రారంభించారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిజాం పాలన చివరి రోజులు పుస్తకావిష్కరణ

కాచిగూడ: ‘నిజాం పాలన చివరి రోజులు.. నా హైదరాబాద్ జ్ఞాపకాలు’తెలుగు అనువాదం పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం రాత్రి కాచిగూడలోని బద్రుక కళాశాల ఆడిటోరియంలో జరిగింది. కేఎం మున్షీ ఆంగ్ల మూలానికి కస్తూరి మురళీకృష్ణ తెలుగులో అనువాదం చేశారు. ప్రజ్ఞాభారతి చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ టి.హనుమాన్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని నిజాం పాలన చివరిరోజులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం సైనిక చర్య చేయడం మూలంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కస్తూరి మురళీకృష్ణ, రాక సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్: ఆరోగ్య మహిళ, శక్తి వంతమైన కుటుంబం పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకంలో భాగంగా ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ పద్మజ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డా. మనోజ్‌రెడ్డి, డా. సంజూసుధతో కలిసి శిబిరాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నియోజకవర్గంలో ఆరు యూపీహెచ్‌సీలలో 14రకాల వైద్య అందించడం అభినందనీయమని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, ప్రభాకర్, గోరక్‌నాథ్, రహీం, టెంట్‌హౌస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని కాలాలకు వాస్తు శిల్పులు విశ్వకర్మలే..

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



మదర్‌డైరీ పార్కులో జరిగిన విశ్వకర్మ యజ్ఞోత్సవంలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్ని కాలాలకు వాస్తు శిల్పులు విశ్వకర్మలే అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఈ దేశ నిర్మాణంలో విశ్వకర్మలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బుధవారం మదర్ డైరీ పార్కులో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని విశ్వకర్మ యజ్ఞోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వకర్మ జయంతిని దేశవ్యాప్తంగా జరుపుకునే విధంగా ప్రధానమంత్రి మోదీ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... చేతి వృత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తన వంతుగా సహకారం అందించాలన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ... చేతి వృత్తుల అభివృద్ధి జరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బహుజన కులాల చేతివృత్తులను ఆధునీకరిస్తే ప్రపంచ పోటీల్లో తట్టుకునే ఉత్పత్తులను తయారు చేస్తారని తెలిపారు. బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర మాట్లాడుతూ... విశ్వకర్మ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జయంతి ఉత్సవ నాయకులు ధీరోజు రవీందర్‌చారి, వలబోజు నవీన్ చారి, గోకులకొండ నరిసింహాచారి, విజయ భాస్కరాచారి, సుధాకర్ చారి, జానాచారి, సంతోష్, వివేకానందాచారి తదితరులు పాల్గొన్నారు.

దినేష్ ఆచూకీ తెలుసుకోవాలని ధర్నా

న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన జీహెచ్ఎంసీ డీఎంసీ రామానుజులరెడ్డి



ముషీరాబాద్: ముషీరాబాద్ వినోభానగర్ నాలాలో కొట్టుకుపోయిన దినేష్ ఆచూకీ నాలుగురోజులైనా లభించకపోవడంతో అతని కుటుంబసభ్యులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పార్శిగుట్ట చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడాలని, దినేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని, అతడి ఆచూకీ వెంటనే తెలుసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాట్లాడుతూ నాలుగు రోజులైనా దినేష్ ఆచూకీ తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆయన ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్-15 డీఎంసీ రామానుజుల రెడ్డి వచ్చి ఆందోళనాకారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి దినేష్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ బాబు, శివప్రసాద్, విజయ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద 45 మందికి రూ.16,6,500 విలువ చేసే చెక్కులు మంజూరయ్యారు. ఈ సందర్భంగా బుధవారం గోల్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ.. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో చేపడుతున్నామని పేర్కొన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌యాదవ్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలీనం... విమోచన... విద్రోహం

సెప్టెంబర్ 17ను ఘనంగా నిర్వహించుకున్న రాజకీయ పార్టీలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 17ను వివిధ పార్టీలు వివిధ రకాలుగా నిర్వహించారు. అప్పటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిజాం నవాబు మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారని కాంగ్రెస్ పార్టీ చెబుతుంటే.. భారతీయ జనతా పార్టీ మాత్రం నిజాం పాలన నుంచి తెలుగు ప్రజలకు విమోచన లభించిందని అందుకే విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక కమ్యూనిస్టు పార్టీలు మాత్రం సెప్టెంబర్ 17 విలీనం, విమోచన కాదని ఇది ముమ్మాటికి విద్రోహ దినమేనని స్పష్టం చేశారు. నిజాం నవాబును, రజాకారుల సైన్యాన్ని తుదముట్టించిన భారత సైన్యం తెలంగాణ ప్రజల విముక్తికోసం పోరాడుతున్న కమ్యునిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలను కూడా చంపారని నిజాం నవాబు లొంగిపోయిన తరువాత మరో ఆరేళ్ల పాటు భారత సైన్యాలు తెలంగాణలోనే ఉండి కమ్యూనిస్టు పార్టీ నాయకులను ఊచకోత కోయడంతో దీనిని విద్రోహదినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. – ముషీరాబాద్



బీజేపీ నగర కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న నాయకులు



జాతీయ జెండాను ఆవిష్కరించిన నగర కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి పద్మజ



అశోక్‌నగర్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్



ఇందిరాపార్కు చౌరస్తాలో జరిగిన విమోచన దినోత్సవంలో ఎంపీ కె.లక్ష్మణ్



హస్తకళా భవన్‌లో జెండాను ఎగురవేసిన రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ



విద్రోహ దినాన్ని పురస్కరించుకొని మార్క్స్ భవన్‌లో మాట్లాడుతున్న కె. గోవర్ధన్



నల్లకుంట డివిజన్‌లో జరిగిన విమోచన వేడుకల్లో కార్పొరేటర్ అమృత



సుందరయ్య పార్కులో జెండాకు వందనం చేస్తున్న వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు



ఆమ్ ఆద్మీ కార్యాలయం వద్ద తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

